# ఇది కథ కాదు

చాబా శివకోటి

చంద్రప్పా త్వరగా అన్నంతిని దక్కా దగ్గరికెళ్ళు అన్నాడు రంగయ్యసేట్.

'మంచిది' అని బయలు దేరాడు చంద్రప్ప - మిర్చికాటా లెక్క వప్ప చెప్పి, 'ఖరీదెంత?' అడిగాడు గుమస్తా సాంబయ్య కాటా లెఖ్ఖ తీసుకుంటూ నాల్గు వందల ఏభైఆరు బస్తాలు - అయితే చివరో ఏడు బస్తాలు సస్తాగా వస్తే

కాటా ఏసి లాటేసిన.

'అంటే మొత్తం నాల్గువందల ఏభై మూడు బస్తాలన్నమాట'.

ఆ! అంతే మరి.

'బళ్ళతోలకం లెక్క కలుపుకునే వచ్చావా?'

'ఆ'!

'ఎన్ని క్వింటాలయిందో ఆరా ఎత్తికట్టులేదు' అన్నాడు సాంబయ్య లెక్క పుస్తకాన్ని చూస్తూ.

'పేజీలుతిప్పు - అంతా వివరంగానే ఉంది. చూసుకో' అని విసుగ్గా లేచి వెళ్తున్నట్టుగా రంగయ్య సేటువైపు ఒకసారి చూసి బయట పడ్డాడు. వళ్ళంతా కారంగా ఉండి - చమట చిత్తడికి చాలా చికాకనిపించింది. 'వెంటనే స్నానం చేసి - అరగంట కూర్చుని, ఇంత తిని - దక్కాకాడి కెళ్ళాలి' అనుకుంటూ నడవసాగాడు.

పది గజాలు నడక ఇంకా సాగలేదు. అంకెల గుమస్తా 'ఇదిగో' అప్పా సేటు పిలుస్తుండు అన్న కేక వినిపించింది. చంద్రప్పకు సేటు మాట వినిపించాక వెనక్కి మళ్ళక తప్పలేదు.

'అప్పా! బస్తాలు కాటా కాగానే నెట్టు వేయించొద్దు. కలకత్తా లారీ వస్తది. మూడు వందల మూడు బస్తాలు వెయ్యి - మిగిల్నియి గోడౌన్‌లో నెట్టు వేయించు. మన సాంబయ్య ఇయ్యాళ్ళ రాత్రి కొట్లోనే ఉంటడు - లోడుకాగానే లారీ నెంబరూ - డ్రైవరు పేరూ వగైరాలు కనుక్కొని కొట్టుకాడికొచ్చి 'ఏ' బిల్లు వ్రాయించి ఇచ్చెయ్యి. మరేమో తెల్లారగట్లే హమాలీల్ని లేపి - ఇవ్వాల్టి ఖరీదు మిరపకాయల్ని దక్కా మీద పల్చగా కార్పించు - బాగా నిమ్మింది.

'పగలు ఏలు చేసుకొని మూడో సారి కూడా తిరగవేయించు. ఏం? అర్థమైందా?' అన్నాడు కనుకొలుకుల్లోంచి చూస్తూ.

అంతా అర్థమైనట్టుగా తల ఊపి మారుమాట్లాడక బయటపడ్డాడు అప్ప. గబగబా నడుస్తుండగా సాంబయ్య పాన్‌కొట్టు కనిపించింది మలుపులో. జర్దాపాన్ తినాలని వెంటనే అనిపించింది.

ఆగి, 'సాంబా' ఒక పానియ్యి. జల్దిపోవాల, అన్నాడు.


చకచకా పాన్‌కట్టి చేతి కందించాడు సాంబయ్య.

పైసలు సరిపోయినన్ని ఇచ్చేసి నడక ప్రారంభించాడు చంద్రప్ప.

'ఇంకా కిలోమీటరుంది - సైకలేమో ఖర్మంచాలక పంచరయి కూర్చుంది. అసలెట్లాగయినా చేసి సైకలుకు కొత్త టైరేస్తే బాగు' అనిపించింది.

ఎదురుగా సైకిలుమీద వస్తున్న శ్రీరాములు దిగి 'ఏడకప్పా' అనడిగాడు.

శ్రీరాములు కమిషన్ గుమస్తా. పెద్ద కొట్టు. సరుకు రైతులనుంచి అమ్మకానికి ఇవ్వటంవల్ల అతడికి చాలా ఎక్కువగా వస్తుంది. రోజు వారీగా ఖరీదు అక్కడ ఉండటాన, మొదటి పరిచయస్తులుగా మారి ఆ తరువాత స్నేహితులయ్యారు. ఆ తరువాత పైసలు అడతకే ఖరీదుకూ అర్థంగాకుండా ఎలా మిగుల్చుకోవాలా? అనే ఉమ్మడి ఆలోచన సన్నిహితుల్ని చేసింది. అది మొదలు రోజువారీ సంపాదనకు అలవాటు పడ్డాడు. తూనికలు తెలీని రైతులూ లెక్క వ్రాసుకోని ఘరానా పెద్దలూ, మార్కెట్టు తెలవనివారూ వచ్చినప్పుడు కాటాలో తేడా చెప్పేవారు. ఆ తేడాను ఇద్దరూ కలుపుకొని అప్పతో చిటీ వ్రాయించుకొనేవాడు శ్రీరాములు. కిలోల్ని పట్టి ఏభైపైసలుంచుకొని మిగిలింది శ్రీరాములు కిచ్చేవాడు సేటు. దాన్ని వాళ్ళిద్దరూ పంచుకునేవారు. ఒక్కోనాడు వాటునపట్టి వంద రెండు వందలదాకా గిట్టుబాటయ్యేవి.



'ఇయ్యాళ్ళ చిట్టి వ్రాయించుకోలేదేం?' అడిగాడు చంద్రప్ప.

'ఇరవై కేజీలున్నాయి గానీ - నలభై వ్రాయి తరువాత చూసుకుందాం' అన్నాడు శ్రీరాములు.

అలాగే అన్నట్టుగా చూసి చిట్టీ వ్రాసిచ్చి దోవనపడ్డాడు.

సగం ఊర్కే వస్తుందని షావుకారనుకుంటే మొత్తానికి ఏతం వీళ్ళు పెడ్తారు.

'సైకిలు మీద దింపమంటాలే' అన్నాడు చిట్టీ జేబులో పెట్టుకొని ఉత్సాహంగా శ్రీరాములు.

'అక్కరలేదు లేవోయ్' అన్నాడు చంద్రప్ప మొఖమాటపడిపోతూ.

'ఫర్లేదు' అని సైకిలెక్కించుకొని గుట్ట ప్రక్కనున్న చంద్రప్ప ఇంటివద్ద దింపి 'ఇక పోతానే' అని వెళ్ళిపోయాడు శ్రీరాములు.

దర్వాజా దగ్గర ఎదురుగానిల్చుని ఎదురుచూస్తూ కనిపించింది చంద్రమ్మ.

ఈ చంద్రమ్మే చంద్రప్ప ముద్దుల భార్య. పెళ్ళయి ఆరేళ్లయినా పాపం భగవంతుడు కరుణించలేదు. మూడో ప్రాణి ఇంట్లోకి రానూలేదు. ఈ మధ్యనే పిల్లలపైకి బాగా ధ్యాస మళ్ళింది చంద్రమ్మకు. మగడితో గట్టిగా చెప్పింది కూడా. అంతటితో ఆగక కనపడ్డరాయికీ రప్పకూ ఇసుగూ ఇరామం లేకుండా మొక్క సాగింది.

భార్యలో మార్పు పసిగట్టాడు చంద్రప్ప. కానీ గమనించనట్టే ఊర్కున్నాడు. ఈమధ్య షిఫాన్ సిల్కు చీర కట్టుకుంది చంద్రమ్మ. చీరలో చానా అందంగా అనిపించింది. చీర ఎటువంటిదైనా అసలు వరిజినల్‌గా చంద్రమ్మ అందమైంది. అందుకు ఆమెను చూసిన ప్రతివక్కరూ తప్పక వప్పుకుంటారు. అయితే అందమంతా చూడటం అయింతరువాత ఈ చీరెక్కడిది? అనిపించింది చంద్రప్పకు. అడుగుదామని నోటిదాకా కూడా వచ్చింది. అయినా చూద్దాం ఏదో ఒక టైంలో చెప్పక పోద్దా, అని ఆగాడు. సమాధానం దొరకలేదు. ఇదిట్టా గుండగానే బంగారపు ముక్కెర కనిపించింది.

'ఎడది?' అని అడుగుదామనుకున్నాడు ఈసారి కూడా. కానీ ఇంతలో, ఏణ్ణీలు పెట్టాను. బేగిస్నానం చెయ్యి' అంది చంద్రమ్మ వంటింట్లోంచి.

అట్టాగే అని స్నానానికెళ్ళాడు చంద్రప్ప.

రాగానే చేపల వేపుడూ ఉలవచారూ ఎదురుగా పెట్టింది.

'చేప లేడయి' అని కూడా అడగాలనిపించింది చంద్రప్పకు.

కానీ చాలా రుచిగా ఉందని జిహ్వ చెప్పడంతో ఆగి - మొత్తం కడుపారా కరువుతీరా ఆరగించాడు. ఆ తరువాత మల్లె పూలెట్టుకొని చంద్రమ్మ చానా నీటుగా నివాటంగా కనిపించింది.

'మంచమెక్కి - పదింటికెళ్తే పోలే' అనుకున్నాడు చంద్రప్ప - తినేసేలా చంద్రమ్మను చూస్తూ.

అందుకు నాందీగా చంద్రమ్మ దగ్గరగా జరిగి భుజాంపై చేతులేసి ఏవేవో ఊసులు గుసగుసలాడాడు. ఏమన్నాడో ఏమోగాని బొమ్ములు తుళ్ళి పడుతుండగా కిలకిలా నవ్వింది.








అది వనువుగా తీసుకొని పక్కేసే ఉంది ఠారాదూ, అన్నాడు చంద్రప్ప.

'ఛ - నేనింకా తినలేదు. సందకాడ్నేనా' అంటూ సిగ్గుపడి కొత్తపెళ్ళి కూతురులా పారిపోయింది. చంద్రప్ప వళ్ళంతా ఎలాగో అయింది. ఇక నాభ ం నేదని వెంటపడ్డాడు.

చంద్రప్ప ఎంత తొందరగా బయటకు వద్దామనుకున్నా ఆలస్యమే అయింది. శరీరంలో స్పీడూ తగ్గింది. అయితే ఈ టైంలో రంగయ్య సేటు వేసిన డ్యూటీ గుర్తుకొచ్చి ఆదలబాదల చొక్కా తగిలించుకొని 'ఇగో' దక్కాకాడ చానా పనుంది గానీ తలుపులు జాగ్రత్తగా వేసుకో, అని చెప్పి పదినిముషాల్లో దక్కా కాడకు చేరుకున్నాడు.

అప్పటికే కాటా మొదలయింది. తిరగేసిన మిరపకాయలు పాళా ఎలా ఉందో చూసుకొని సంతృప్తి పడి కాటా దగ్గరకెళ్ళి పట్టుబడి ఎన్ని కిలోలమీదనో చూసుకొని, దూరంగా లైటుక్రింద వేసి ఉన్న మడతకుర్చీ దులుపుకొని ఆరామ్‌వు కూర్చొని చుట్టూరా చూసుకున్నాడు.

మిరపకాయలు తొక్కటం నడుస్తుండగానే మేస్త్రీ దిగిన బస్తాల్ని దిగినట్లు కుట్ట సాగాడు.

'ఇగో మేస్త్రి! కలకత్తా లారీవస్తుంది. త్వరగా కానియ్యండి. నెట్టు మాత్రం వెయ్యొద్దు. దానికి లోడు చేయ్యాలి' అని చెప్పాడు చంద్రప్ప.

పూర్తయిన బస్తాను లైనుకేసి రెండోబస్తా దగ్గిరకొస్తూ - అదెంతసేపు అన్నాడు మేస్త్రి.

రాత్రి పదకొండు ఘంటలయ్యేసరికి కాటాలూ పూర్తయినయి. లారీ రానూ వచ్చింది. లారీ రాగానే చంద్రప్పగారూ, 'లారీ లైనులో పెట్టించండి. లోడు మొదలెడతాం' అన్నాడు పెద్దగా మేస్త్రి.

'అలాగే' అని లారీ డ్రైవరుతో లైనులో పెట్టించి. లారీ నెంబరూ వగైరా వివరాలు వ్రాయించుకొని 'ఇగో మేస్త్రి. మూడువందల మూడు బస్తాలు లోడు చెయ్యి - ఇద్దరు మనుష్యుల్ని ఎక్కించి తొక్కుతూ వెయ్యండి. లోడు ఎత్తురా కూడదు. అని ఆగి గుమస్తా రంగణ్ణి పిలిచి నేను 'ఏ' బిల్లు రాయించుకొని వస్తానుగానీ లోడు చేసేప్పుడు నెట్టు జాగ్రత్తగా లెక్కెట్టుకో మొత్తం శాల్తీలు మూడువందలమూడు. వెళ్ళనా, అని కొట్టువైపుగా నడిచాడు.

టీకొట్టుకాడ ఆగి, 'చాయ్‌ త్రాగి కొట్టు దగ్గిరికెళ్ళేసరికి తాళంవేసి కనిపించింది. సాంబయ్య ఎందుకు రాలేదో చంద్రప్పకు అర్థంకాలేదు. పోయి పిల్చకరావాలి అనుకుంటూ వెనక్కి తిరిగాడు. ఒకవేళ సేటు ఇంటికాడ ఏమన్నా పని ఉండి ఆగిఉంటాడా?' అని అనుమానమొచ్చింది. ఆడిల్లు కూడా అటేగా అనుకుని సేటు ఇంటిదాకా నడచి - ఆగి - బయట ఉన్న బజ్జర్ నొక్కాడు.

నాల్గయిదు సార్లు నొక్కింతరువాత సేటు భార్య జానికమ్మ 'నువ్వా' అంటూ వచ్చి తలుపు తీసింది. ఆమె కళ్ళలో మెరుపు కనిపించింది చంద్రప్పకు.

జానికమ్మ సేటు రెండో భార్య. ఇద్దరు పిల్లలు. అయినా వయసు పెడుసుగా పిటపిటలాడుతూంది. చంద్రప్ప అంటే అంతులేని ఇది ఆమెకు.

'సాంబయ్యేమో ఇంకా రాలేదు. ఈడేమైనా పనుండి సేటు దగ్గరున్నాడేమోనని లేపాను' అన్నాడు.

'మీ సేటు లేదు. ఆయనొచ్చేసరికి ఒంటి గంట అవుతది' అంటూ ఓరగా చూస్తూ

'ఏడికెళ్ళిండేంది?'

'నాకు తెలీదు. నేను కొట్టుకాడనే ఉంటాడనుకుంటున్నాను.' అంటూ ఆశ్చర్యంగా చూస్తూ

'అయితే ఇక పోత, సాంబయ్యను లేపుకెళ్ళి 'ఏ' బిల్లు వ్రాయించాలి. లారీ లోడయిపోతది'.

'మంచినీళ్ళు త్రాగి వెళ్ళరాదూ?'

ఆ మాట విన్నాక నిజంగా దాహం అనిపించింది చంద్రప్పకు. 'అట్టగే' అంటూ లోనకొచ్చాడు.

'ఎవరూ?' అని సేటు ముసలి తల్లి కేక వినిపించింది.

'మన చంద్రప్ప అత్తయ్యా మీ అబ్బాయికోసం వచ్చాడు' అంది అంత పెద్దగా జానికమ్మ అటువైపుకుతా అని సైగచేసి.

చల్లటి మంచినీళ్ళు చెంబడు త్రాగి 'ఇక పోతానేం?' అన్నాడు చంద్రప్ప.

'మాట' అంది జానకమ్మ తలవంచుకుని పైట జార్చి నడుస్తూ.

వెంట నడిచాడు మౌనంగా చంద్రప్ప.

బయట తలుపు చేడం పెట్టి. దగ్గరికొచ్చింది.

ఏమిటన్నట్టుగా చూశాడు జానకమ్మ మొఖంలోకి.

మసక వెలుగులో మబ్బులచాటున చందమామలా కనిపించింది.

'కూర్చోరాదూ? అంది చాప పరచి ఓ దిండు దానిమీదకు విసిరి.

కూర్చున్నాడు.

పక్క విరుచుకొని అవయవాల తీరును ప్రదర్శించి అమాంతం మీద పడిపోయింది.

చంద్రప్ప మగాడేనాయె - ఆ సోయగం ధైర్యం చూసిం తరువాత మారు మాటాడక జానకమ్మ నేలుకున్నాడు. చంద్రప్ప బయట పడేసరికి పన్నెండు దాటింది.

సాంబయ్య కొంపదేసి ఉత్సాహంగా అడుగులేసాడు.

సినిమా దగ్గర సెనక్కాయలమ్ముకునే నాగులు కలిసి 'ఇప్పుడేడికే' అనడిగాడు.

'సాంబయ్య కాడికిరా' అన్నాడు నడుస్తూనే.

'సైకిలుమీద కొట్టేపే పోయాడు గదనే ఇందాక' అన్నాడు నాగులు.

'ఎప్పుడు?' అని ఆగి వెనక్కు తిరిగాడు చంద్రప్ప.

'ఊ! అరఘంట అయింది.'

'నిజం!'

అమ్మతోడు నే చూసాను.

కొట్టేపు పరుగెత్తినట్టుగా నడిచాడు.

పదిగజాలు నడిచినాక రగ్గు మరిచిపోయినట్టు గుర్తుకొచ్చి, ఇల్లు దగ్గర్నే ఉంది గదా వెళ్ళి తీసుకెళ్దాం అనుకొని సగంలో ఇంటివైపుగా నడక మార్చాడు.

సరిగ్గా ఇంటిముందున్న చింత దగ్గర కొచ్చేసరికి, ఇంటి తలుపొకటి తెరచి ఉన్నట్టనిపించి, పారజూచినట్టు పొడిచాడు.

రెండు నిముషాలయింతరువాత రెండో రెక్క కూడా తెరచుకుంది.

'చంద్రమ్మకేదైనా దివ్యదృష్టిలాంటిదుందా ఏం? నేనొచ్చే సరికి తలుపులు తెరుస్తుంది' అనుకొని హుషారుగా లోనకడుగులేసేందుకు ఆయత్తమయ్యాడు.

'వస్తాను' అంటూ రంగయ్యసేటు బయటకొస్తూ కనిపించాడు.

వళ్ళు ఝల్లు మంది చంద్రప్పకు.

జుట్టూ చీరా సవరించుకుంటూ, వీడ్కోలు చెపుతూంది చంద్రమ్మ సేటుకు.

మతి పూర్తిగా పోయింది. ఆ దృశ్యం కంట బడినాక.

ఆవేశం ఉప్పెనలా వచ్చింది.

అమాంతం మీద పడి బొండిగ కొరికి వెయ్యాలనిపించింది.

కాని......

అడుగు ముందుకు పడలేదు.

ఈ లోపు సేటు చకచకా వెళ్ళి పోయాడు.

ఒక్క క్షణం చంద్రమ్మను నిలువునా చీరెయ్యాలనిపించింది.

ఆవేశం ముప్పిరి గొనగా అడుగేసే ప్రయత్నం చేసాడు చంద్రప్ప.

ఊహు, ఎంత ప్రయత్నించినా అడుగు కదలలేదు.

బలవంతంగా శక్తినంతా కూడతీసుకొని, ప్రయత్నించి నడచాడు.

వెర్రి ఆవేశంలో తలుపును దబదబా బాదబోయాడు.

ఏదో ఆలోచన లేచిన చేతుల్ని ఆపింది.

ఆగి వెనక్కి తిరిగాడు.

'నేనిప్పుడెట్నుంచి వచ్చింది' నేను చేసిన పనేమిటి? అనిపించింది మనసుకు.

ఎంత క్రింద ఆగాడు ఒక్క క్షణం.

ఆవేశం అంతరించింది. ప్రశాంతంగా మారాడు.

నవ్వు మెదలిందతని మొఖంలో

చకచకా నడచి కొట్టు కాడకొచ్చాడు. తాళం తీసుంది. సాంబయ్య కొట్లో కూర్చుని కునికిపాట్లు పడుతూ కనిపించాడు. చంద్రప్ప వచ్చిన అలికిడికి ఉలిక్కి పడి కొలుకుల్లోంచి చూసాడు.

నవ్వి, లారీ వివరాలిచ్చాడు చంద్రప్ప.

ఆలస్యమైనందుకు గదమనందుకు - కృతజ్ఞతగా పలకరించాడు సాంబయ్య.

*





## వధువు మరియు వరుడు కావలెను

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగు చదివి గల్ఫ్ కంట్రీసులో పనిచేస్తున్న 29 సం//ల వయసు. 5'-4" ఎత్తు కలిగిన ఆధునిక భావాలు గల అందమైన బలిజ/నాయుడు యువకునికి కనీసం డిగ్రీ చదివిన, 23-25 సం//ల వయస్సు కల్గిన ఆధునిక భావాలు గల వధువు కావలెను. కుల, కట్న ప్రసక్తిలేదు.

23 సం//ల వయస్సు కల్గి, వివాహము అయిన తర్వాత ఒక నెల మాత్రమే కాపురం చేసి విడాకులు తీసికోబోతున్న తన చెల్లెలికి అభ్యుదయ భావాలు గల వరుడు కావలెను. కుండమార్పిడి పద్ధతిపైగాని, ఇలాంటి పరిస్థితులలో నున్న వారినుంచి గాని, విడి విడిగా గాని ఫోటో వివరాలతోగాని వెంటనే ఈ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

**Dr. P.S. REDDY,**
**BANJARA SADAN,**
**HIMAYAT NAGAR, 14 STREET**
**HYDERABAD - 29**




# ఎందుకంటే

- బజాజ్ స్టోరేజీ వాటర్ హీటర్ క్షణాల్లో పొగలు కక్కే వేడి నీళ్లు అందిస్తుంది.
- దీనిలో వుంది ఖచ్చితమైన థర్మోస్టాటిక్ కంట్రోల్.
- లోపలే అమర్చబడిన ప్రెషర్ రిలీజ్ వాల్వ్, ఫ్యూసిబుల్ ప్లగ్ మరియు రక్షణ సదుపాయాలు. మరియు
- దీనిపైన కలదు విశ్వసనీయమైన బజాజ్ పేరు. భారతదేశంలో మా అత్యధిక విస్తృత శ్రేణి ఉపకరణాలను దేశమంతటా గల మా 1000 డీలర్లు మీకు అందించగలరు.

**అందుకే మరి అందరూ ఇష్టపడ్తారు బజాజ్ స్టోరేజీ వాటర్ హీటర్!**

BE-801-TEL

